# విముక్తి

రామ్మూర్తి దీర్ఘంగా నిట్టూర్చాడు.

రోడ్డువారకు వెళ్ళి చేతిలోవున్న "ప్యాకెట్" నేల మీద పెట్టి, దీపపుకాంతిలో జేబులోని పొట్లంవిప్పిచూశాడు. లోనున్న మందు నల్లగా మిలమిల మెరుస్తోంది.

అదే మందు! సందేహం లేదు.

మళ్ళీ పొట్లంకట్టి జేబులో పడేసుకొని నడక సాగించాడు.

రామ్మూర్తి మనసు సంతోషంతో ఉరకలు వేసోంది. ఆనందాతిశయముతో నుదుట పట్టిన స్వేదాన్ని, అరచేతితో తుడుచుకున్నాడు. ఉత్సాహంగా అడుగులు పడుతున్నాయి. అలవాటు చొప్పున తను రోజూ క్షణంసేపు నిలబడే ఆ గేటు వద్దకు వచ్చి ఆగిపోయాడు. ఆ యింట్లోనుండి గాలి మోసుకొస్తున్న మత్తెక్కిన "నైట్‌క్వీన్" పరిమళాన్ని, మంద్రస్థాయిలో వినిపిస్తున్న లలితసంగీతాన్ని క్షణంసేపు ఆస్వాదించాడు. పనిలేని రెండు జడల అమ్మాయి ఒకజడ ముందుకు, మరొకజడ వెనుకకు వేసుకొని తీరుబాటుగా "బాల్కనీ"లో పచార్లు చేస్తోంది.

రామ్మూర్తి మళ్ళీ నడవటం ప్రారంభించాడు. ఉల్లాసంగా, గర్వంగా నడుస్తున్నాడు రామ్మూర్తి. పున్నమినాటి సముద్రంలా అతని మనసు వుప్పొంగుతోంది!

ఇంట్లో ప్రవేశిస్తూ, చేతిలోని ప్యాకెట్ కనబడకుండా వెనుకను దాచి అన్నాడు. "సావిత్రీ! నీకు ఏం తెచ్చానో చెప్పుకోవాలి?"

మాసికలువేసిన చీరతో; మాలిన్యమయిన ముఖంతో వున్న సావిత్రి పెదవులమీద చిన్ని హాసం వెలిగి వీచికలా మాయమయింది. అనారోగ్యానికి ప్రతినిధిలా వుండే సావిత్రి, తెరలుగా వచ్చేదగ్గును ఆపుకొంటూ, పెదాలు తడుపుకొంటూ అంది. "ఏం తెస్తారు లెండి? ఇంతకూ నాకు మందు పట్టుకొచ్చారా?"

రామ్మూర్తి మనసు వ్యధతో నిండిపోయింది.

తనలోని సంతోషాన్ని ఎవరో పీల్చివేస్తున్నట్లనిపించింది.

మనసులోని భావాలను తెలియనీయకుండా చిరునవ్వుతో అన్నాడు "మందు తెచ్చానుగాని, ముందు ఈచీర నచ్చిందో లేదో చెప్పు!"

"పేకెట్"విప్పి ఆమె ముందు పడేశాడు. గుడ్డిలాంతరు వెలుగులో చీర జిగజిగలాడింది.

సావిత్రి కళ్ళు సంతోషంతో మిలమిల్లాడాయి!

"చాలా బాగుంది. ఖరీదెంత?"

"ఎంతయితేనేం? బాగుందికదా?"

అనుమానంగా రామ్మూర్తి కళ్ళల్లోకి చూసింది సావిత్రి.

"ఈ లాగు, చొక్కా గోపీకి, ఈ గౌను లక్ష్మికి..."

స్తబ్ధుగా నిలబడిపోయింది ఆమె!! క్షణంసేపటిలో ఏదో ఆలోచన స్ఫురించినట్లు, బట్టలు తీసుకొని వెళ్ళి పెట్టెలో పెట్టింది.

భర్త ప్రవర్తన ఆమెకు ఈ రోజు ఉదయంనుండీ వింత గానే గోచరిస్తోంది. అతనిలో తాను మునుపెన్నడూ చూడని సంతోషాన్ని, ఉషారునూ; క్రొత్తదనాన్ని గమనించింది. ఆమెలో వెయ్యి సందేహాలు తల ఎత్తుతున్నాయి! చిన్నచిన్న పొగల్లా లేచిన సందేహాలు పెద్దవై మనసు నంతటినీ కప్పే స్తున్నాయి.

సాధ్యమయినంత వరకూ అన్నిటినీ మనసులోనే అణిచివేసింది. మధ్యాహ్నం మాటల సందడిలో అడిగితే "ఈ వేళ నా పుట్టిన రోజు!" అన్నాడు.

ఇలాటి జన్మదినాలు మధ్యకాలంలో ఎన్ని గడవ లేదు!

ఎన్నడూ చూడని అంత ఉత్సాహానికి కారణంకనిపిం చటంలేదు.

సావిత్రి ఆలోచనలతో వుక్కిరి బిక్కిరి అవుతోంది.

పెట్టెతలుపులు మూస్తూ అంది "వేగిరం లేవండి. భోజనం చేద్దురుగాని."

భర్త సన్నగా ఈలపాట పాడుతూ కాళ్ళు కడుక్కోవటం సావిత్రికి స్పష్టంగా వినిపించింది. బరువుగావున్న మనసును తేలికచేసుకొని, పీటవాల్చి అంతా సిద్ధంచేసింది. కూరకలుపుకొంటూ అన్నాడు "అమృతంలావుంది నీవంట, నీకుకూడా గోరుముద్దలు చేసి తినిపిస్తాను! కూర్చో?"

"నీ చేతివంట కుక్కలుకూడా ముట్టవు!" అని విసురుగా నిన్నరాత్రి భోజనంవద్దనుండి చికాకుతో లేచిపోయిన భర్త ఈ రోజున తన వంట అమృతంలా వుందని పొగుడుతున్నాడు. ఈ మొగవాళ్ళు దేనికైనా తగుదురనుకొంది సావిత్రి.

"చాల్లెండి. అన్నీ మీరేచెప్పాలి. ఎవరైనా వింటే నవ్వుతారు."

భోజనం ముగించి, బయటకువచ్చి తాతలనాటి పడక కుర్చీ దులిపి ఆరుబయట వెన్నెలలో వేసుకున్నాడు రామ్మూర్తి! సిగరెట్టు ముట్టించి ఆహ్లాదంగా పొగవదుల్తూ కుర్చీలో నడుంవాల్చాడు. ఇపుడు అతని మనసు దూదిపింజలా చంద్రునిచుట్టూ పరిభ్రమించే మేఘంలావుంది.

తన మనస్థితి చూస్తే తనకే ఆశ్చర్యవేస్తోంది. అనుక్షణం తనచుట్టూ రేగుతున్న బాధలను దుమ్ముదులుపుకున్నట్లు దులిపేసు కుంటున్నాడు.

"రేపు...పర్వదినం! రేపటినుండి తను విముక్తుడవుతాడు! పనిలేని బాల్కనీలో పచార్లుచేసే రెండుజడల

అమ్మాయి తనను యిక కన్పించదు. నైట్‌క్వీన్ పరిమళం, లలిత సంగీతం ఇవేమీవుండవు. యిక తను ఎవర్నీ లెఖ్ఖ చెయ్యనక్కర లేదు. ఆఫీసులో మేనేజరుకు, హెడ్‌గుమాస్తాకు భయపడటం ...కి · కాసెట్టి చూస్తాడని రోడ్డువారగా నడవటం......అప్పులవాళ్ళు కన్పిస్తే భయంగా పరుగు తీయటం......ఈ బాధలు ఏవీవుండవు. డాక్టర్లు...... రోగాలు...భయం...చీకు...చింత..మచ్చుకయినామిగలవు. ముళ్ళతీగెలాటి తన జీవితం అంతమవుతుంది.

మనసు మధురమయిన ఊహల్లో తేలిపోతోంది.

అంతలోనే... తెరల్లాంటి ఆ ఊహాలను చింపుకుంటూ మాడ్చుకున్న ముఖాలతో గోపీ, లక్ష్మి, సావిత్రి లీలగా గోచరించారు. మనసుమీద ఏదో బాధలు కప్పినట్లు యింది.

"రేపటినుండి...వాళ్ళగతి ఏంకాను?"

ఇంట్లో సామాన్లు ఉన్నంతవరకూ...మహాజరిగితే, నెలరోజులవరకూ బాగానే జరుగుతుంది.

తరువాత?

తిండికి ముఖంవాచి లక్ష్మి గోలున ఏడుస్తుంది.

గోపీ ఏడ్చే ఓపిక లేక బిక్కముఖం వేస్తాడు.

సావిత్రి, తను చనిపోయిన బాధతో మిలిపోతూ, వాళ్ళను సముదాయించలేక నుయ్యో, గొయ్యో చూసు

కొంటుంది?...కుర్రవాళ్ళిద్దరూ అనాథల్లా మిగిలిపోతారు. తిండీ, సంరక్షణ లేక...వాడిపోయి, మాడిపోయి చచ్చి పోతారు !

"భగవాన్! సావిత్రి కూడా చచ్చిపోతే..." ఉహు ఇక దుర్భరపరిస్థితిని ఊహించలేదు తను. రోడ్డురోలరులా జీవితాన్ని తను ఈడ్చి, ఈడ్చి, ఇక శక్తి లేక, తనలోని జీవం అంతా ఇంకిపోతే—తను ఆత్మహత్య చేసుకోబోతున్నాడు ! సావిత్రి పిల్లల్నిద్దరినీ పెంచుతుందన్న ధైర్యమే తనకు ఇంత వరకూ శాంతి నిచ్చింది.

"ఒకవేళ సావిత్రికూడా వాళ్ళను వదిలేస్తే!...ఉహు! అలాగ ఎన్నటికీ జరగదు ! ఆమెకు ఓర్పువుంది!"

రామ్మూర్తి తన మనసులోని ఆలోచనలను తరిమి వేయటానికి ప్రయత్నిస్తున్నా, అవి అతనికి లొంగకుండా మనసుమీద దాడిచేస్తున్నాయి. ఆలోచనలు ముసురుతున్న కొద్దీ మనసు పిరికితనాన్ని నూరిపోస్తోంది. ఈ ఆలోచనల నుండి విముక్తుడయితేనేగాని, తను ఆత్మహత్య చేసుకోలేడు. గుండెను దిటవు పరచుకున్నాడు.

"రాత్రి అంతా సద్దుమణిగాక, తను జాగ్రత్తగా తెచ్చిన మందును వేసుకోవాలి. ఆ మందు ఎక్కువ మోతాదులో వేసుకుంటే నిద్రలో ప్రాణంపోతుందని తను ఆచారిద్వారా విన్నాడు. అందుకే సులువయిన, మంచిమందును, ఎక్కువ

మోతాదులో జాగ్రత్తగా సంపాదించి సాయంత్రం తనతో తీసుకు వచ్చాడు."

వంటింటి తలుపు గడియపెట్టి బయటకు వచ్చింది సావిత్రి.

"పిల్లలు ఏంచేస్తున్నారు?" భార్యవంక ప్రశ్నార్థకంగా చూశాడు రామ్మూర్తి.

"లక్ష్మి నిద్రపోతోంది. గోపీ "ప్రయివేటు"కువెళ్ళాడు వచ్చేవేళ అయింది.

"నేను తెచ్చిన చీరకట్టుకొని, టేబులుమీదవున్న మల్లె చెండు తలలో పెట్టుకొనిరా."

భర్తముఖంలోకి వింతగా చూసింది సావిత్రి.

"ఊ! త్వరగా రావాలి మరి!" బుజ్జగిస్తూ అన్నాడతను.

అయిష్టంగానే కదిలింది.

ఆలోచనలలో తేలిపోతున్న రామ్మూర్తికి ఎదురుగా ఎవరో దేవకన్య ప్రత్యక్షమయినట్లయింది. కళ్ళు నులుపుకొని చూశాడు.

సావిత్రి!! మెల్లగావచ్చి ప్రక్కన నిలబడింది. వెన్నెలలో ఆమె ముఖం తళతళ మెరిసిపోతోంది. పెదవులు అమాయకంగా కదుల్తున్నాయి. జడలో తురుముకున్న మల్లెచెండు

దీనంగా నవ్వుతోంది! విభ్రాంతితో కన్నార్పకుండా ఆమెవైపు చూస్తూ ఉండిపోయాడు.

"ఏమిటండీ! అలా చూస్తున్నారు?" చిన్నగానవ్వుతూ అంది.

"అప్సరసలు నీలాగే వుంటారా అని ఆలోచిస్తున్నా!"

సావిత్రి గలగలా నవ్వింది.

నవ్వును అడ్డుకొంటూ సన్నని దగ్గుతెరవచ్చి మాయ మయింది.

"కూర్చో"

రామ్మూర్తికి దగ్గరగా మెట్లమీద కూర్చుంది సావిత్రి.

రెండుచేతులూ ఆమె చెంపమీద అన్చి దగ్గరగా లాక్కో బోయాడు రామ్మూర్తి బలవంతంగా విడిపించు కొంటూ అంది, "మరీ చిన్న పిల్లలయిపోతున్నారు. ఇలాచేస్తే నేను ఇంట్లోకి వెళ్ళిపోతా!"

మధురంగా లేస్తున్న కెరటాల్లాంటి కోరికలను బల వంతంగా అణచిపెట్టుకొంటో ఆమెముఖంలోకి చిలిపిగా చూశాడు. ఆక్షణంలో అనిపించింది. "సావిత్రి అందాన్ని తను ఇంతవరకూ గుర్తించలేదు. అని" ఆమె ముఖాన్న వున్న నయాపైసంత కుంకుమబొట్టు వెన్నెలకాంతిలో వింతగా మెరు

స్తోంది. రెండు నిమిషాలు రెప్పవాల్చకుండా ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాడు.

“నమూపైసంత కుంకుమ బొట్టు... వెన్నెల కాంతిలో మెరిసి—క్రమేణా కాంతి విహీనమై— కరగిపోయింది. వణుకుతున్న పెదాలతో—పాలిపోయిన ముఖంతో—నుదుట కుంకుమ చెదిరిపోయి—మూర్తిభవించిన శోకదేవతలా” అనిపించింది సావిత్రి.

“మింగేస్తారేమిటి? ఇలాచూస్తున్నారు.” నవ్వుతో అంది. భర్తలోని ఉత్సాహంచూశాక ఆమెకు కూడా కారణం తెలియకుండా ఉషారువస్తోంది. “ఇంతకీ అసలు కారణం చెప్పలేదు. ఏ “లాటరీ” అయినా వచ్చిందేమిటి?”

“ఆ! మనకి అంత అదృష్టం కూడాను!” నీరసంగా రామ్మూర్తి! లాటరీ వచ్చినా బాగుండు ననిపించింది అతని మనసుకు.

“తను చెయ్యబోయే పనికి సమకూర్చుకొన్న ధైర్యం; స్థయిర్యం చిల్లుపడి కారిపోతున్నాయి.”

భార్యను చూస్తూవుంటే మళ్ళీ సంసారంమీద మోజు పుడుతోంది అతనికి.

ఏనాటినుండో, ఈ బాధలనుండి తప్పించుకొనేందుకు ప్రయత్నించి...ఇన్నాళ్ళకు ఆ ధైర్యాన్ని సమకూర్చుకోగలిగాడు, తనకు జీవితంలో తీరకుండా మిగిలిపోయిన కోరి

కలను చాలావరకూ తీర్చుకున్నాడు. సాధ్యమయినంత ఆనందాన్ని, సుఖాన్ని ఆఖరుక్షణాలంలో అనుభవించి చచ్చిపోవాలనుకున్నాడు.

కాని, ఆ ఆలోచనలన్నీ వేడితగిలిన మంచులా కరిగిపోతున్నాయి.

మనసు దిటవు చేసుకోందామనుకున్నా లొంగటం లేదు.

మెల్లిగా భార్య అరచేయి నిమురుతూ అన్నాడు. "సావిత్రీ! నేను హఠాత్తుగా చనిపోయాననుకో..."

బలవంతంగా తనచేతితో అతనినోరు మూసింది సావిత్రి. కళ్ళలో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళను ఆపుకొంటూ వణుకుతున్న గొంతుతో అంది. "ఛా! అవేంమాటలు? ఇలా కులాసాగా కబుర్లు చెప్పుకొనేవేళలో ఏమిటా ఆలోచనలు? మీరు లేకుండా నేను క్షణంకూడా బ్రతుకలేను......బ్రతుకలేను..." రామూర్తి వక్షంమీద తల ఆన్చి ఉబికివస్తున్న దుఃఖాన్ని ఆపుకోలేక ఏడ్చేసింది.

అతని కళ్ళలోకూడా నీళ్ళు తిరిగాయి.

ఆమెను మెల్లగా లేవనెత్తుతూ అన్నాడు "ఏదో! పూరికే అన్నాను. దానికోసం బాధపడకు."

సావిత్రి చీరచెంగుతో నీళ్లు తుడుచుకొంది.

రామూర్తి ఆమె కళ్ళల్లోకి సూటిగాచూశాడు. దైన్యం అమాయకత్వం గూడుకట్టుకున్న ఆ నేత్రాల్లో ఏదో

ఆశాకిరణం అస్పష్టంగా మెరుస్తోంది. ఆమె మంచితనం తన మనసుమీద పరిపాలిస్తున్నట్లని పించింది.

నల్లని మేఘాల్లాంటి భయం మనసునిండా ఆక్రమిం చింది.

ఒంటరిగా రోదసీలో ప్రయాణిస్తున్నట్లుంది రామ్మూర్తికి.

వెండిలా మెరిసిపోతున్న పున్నమి చంద్రునికి అడ్డంగా నల్లని మేఘం వెళ్ళింది. కాంతి పల్చనయింది. కొద్దిక్షణాల్లో మేఘం చంద్రుడ్ని దాటిపోయింది. ఎప్పటివలెనే వెన్నెల తళతళలాడుతోంది. ప్రకృతి తనకేదో వింతరహస్యాన్ని బోధి స్తున్నట్లని పించింది.

అర్థంకాని నిట్టూర్పు విడిచాడు.

సావిత్రి మెడలోని నల్లపూసలు వెన్నెలకాంతిలో మెరుస్తున్నాయి.

జాగ్రదావస్థ, స్వప్నావస్థ కాని మధ్యమావస్థలో కొంతసేపు వుండిపోయాడు.

భార్య తన పాదాలను కళ్ళకు అద్దుకొని బరువుగా అడుగులువేస్తూ యింట్లోకి కదిలి పోవటం లీలగా జ్ఞాపకం ఉంది.

ఉషఃకాంతి పల్చగా అలుముకుంటూ వుంటే తెలివి వచ్చింది మూర్తికి! బద్ధకంగా ఒళ్లు విరుచుకొని లేచాడు. మన

స్సంతా భారంగా ఉంది. రాత్రి ఆరుబయట పడకకుర్చీలో నిద్రపోవటంచేత మంచుకురిసి ఒళ్ళంతా తాళ్ళతో బంధింప బడినట్లుఉంది.

రాత్రి తలుచుకొన్న స్వర్గలోకపు దృశ్యాలేవీ కళ్ళ ముందు మెదలక పోవటంచేత ఇంకా బ్రతికివున్నట్లు తెలిసింది అతనికి! తను చూడకూడదనుకున్న "శేపు"ను చూసినందు లకు మనసు అదోలా అయిపోయింది. గత జీవితానికి పల్చని తెర అడ్డువచ్చినట్లు, రాత్రి సంగతులు ఆ తెరవెనుక లీలగా మెదుల్తున్నట్లు వుంది.

సావిత్రి యింకా పడుకునే వుంది. పెదవులుఏదో రహ స్యాన్ని బోధిస్తున్నట్లు ముకుళించుకొని ఉన్నాయి. రాత్రంతా అవ్యక్తమయిన బాధను అనుభవించినట్లు బుగ్గలమీద కన్నీటి చారలు సాక్ష్యమిస్తున్నాయి.

"సావిత్రీ!" మెల్లగా తట్టిలేపాడు.

లోపలనుండి ముఖం కడుక్కొని తడి చేతులు తుడుచు కొంటూ వచ్చాడు గోపి.

"నాన్నా! రాత్రంతా అమ్మదగ్గుతో బాధ పడింది! మందుకోసం ఎంతో సేపు వెదికింది. చివరకు నీ జేబులో దొరికింది! అది తీసుకున్నాక కొంచెం దగ్గు తగ్గి నిద్రపట్టింది." ఇక కొడుకు చెపుతున్న సంగతులు రామ్మూర్తి చెవులకు వినబడటం లేదు.

చెవుల్లో ఎర్రగా కాల్చిన పదునైన గునపాలు గ్రుచ్చు తున్నట్లువుంది.

"సావిత్రీ!" గట్టిగా అరుస్తూ భార్యను కుదిపేశాడు. ఆమెలో చలనంలేదు.

తను ఎంత ప్రయత్నించినా ఈ లోకంనుండి విముక్తి పొందలేక పోయాడు. కాని సావిత్రికి తననుండి విముక్తి కలుగజేశాడు.

రామ్మూర్తి తన జీవితంలో ఏనాడూ ఇంతగా ఓడి పోలేదు.

★★★